

# ప్రేమంటే...?

● అనితా వొజ్జల ●

ప్రియతమ్!

నీకు తెలుసా?

ఇక్కడ నా హృదయంలో సముద్రం ఉప్పొంగుతుందని....ఉధృతంగా ఎగిసిపడే కెరటాల్లా నీ స్మృతులు నన్ను వెంటాడుతున్నాయని...

ఇంకో రెండు క్షణాల్లో నీ చేతులు ఈ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తాయని నాకు తెలుసు... కానీ నీ మనస్సులోని నా జ్ఞాపకాల అవశేషాలను దేనితో చెరపగలవు? అందుకే దయచేసి ఈ ఉత్తరాన్ని చింపకు...! నీ జీవితంలో ఈ ఉత్తరాన్ని చదువుకోవాల్సిన అవసరం తప్పకుండా వస్తుంది. ఇదే నేను నీకు వ్రాసే చివరి ఉత్తరం కావొచ్చు.

నేనిలా వ్రాయడం నీకు ఆశ్చర్యాన్నే కలిగించవచ్చు. కానీ ఏం చెయ్యను? ఎన్ని సంవత్సరాలుగా బలవంతాన నాలో అణుచుకున్నా ఇక ఆగలేనంటూ ఆవేశం బయటికొచ్చింది.

బాధపడే హృదయపు మూలుగు ఎప్పుడైనా విన్నావా? లేకుంటే ఒక్కసారి నా హృదయంలోకి తొంగి చూడు...! నా అంతర్ముఖంలో రగులుతున్న అగ్నిలోని ఆవేదన అర్థమవుతుంది.

"నీకు బాధా...! ఓవ్ నవ్వొస్తుంది నాకు... బాధేందుకు ఇపుడు మనకేమయ్యింది? బాగానే వున్నాంగా!'' అని నీవంటావ్!

కానీ నీలా అంత తేలిగ్గా తీసుకోలేకపోతున్నా.

అసలు జీవితమంటే ఏమిటి?

ఇల్లు, పిల్లలు, సంసారం... ఇంతేనా?

విసిగిపోయాను నేను ఈ జీవితంతో.

నా బాధకు కారణమేమిటని నీవు ఎప్పుడైనా అడిగావా? నేను బాధపడుతున్నానని నీకు తెలుసు. అయినా అడగవు!

మన జీవితాలు ఇంత మెటీరియలిస్టిక్‌గా ఎందుకు మారిపోయాయి?

పెండ్లికాక ముందు వున్న ప్రేమికుల్లా మనం ఎప్పటికి వుండలేమా?

అప్పటి ప్రేమా... అనురాగం... ఫీలింగ్స్... ఏమైపోయాయి? గుండె పరదా వెనుక గూటిలో దాగుండిపోయాయా...?

●●●

బాధపడే హృదయపు మూలుగు ఎప్పుడైనా విన్నావా?

●●●

మన మధ్య నిర్లిప్తత ఎందుకు వాగులా ఉప్పొంగుతుంది?

నేను ఇంటి అవసరాలు... పిల్లల పనులు... ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించటం... నేను ఈ బిజి... నువ్వు ఆ బిజీ... తప్ప మన మధ్య ఇంకేం లేదా? మన మధ్య పెద్ద అగాధం... లోతు తెలియని బావిలా... ఎందుకు? ఎందుకు ప్రియతమ్? నీవు భర్త అనే నేను భార్య అనే ముసుగు వేసుకొని ఒకరి కొకరు ఏమీ కాకుండానే బ్రతుకుతున్నాం! ఎందుకీ ఆత్మవంచన! ఎవరికోసం! ఎందుకోసం! అని అడిగితే మరీ పచ్చిగా మాట్లాడుతున్నానని లేదా ఇంకేదో అంటుంది ఈ లోకం.

చెప్పు ప్రియతమ్! ఎందుకలా మౌనంగా వుంటావ్! నీ మౌనం నా హృదయాన్ని నిలువునా చీల్చేస్తుంది! ఇకనైనా మాట్లాడు! నీవు నాతో మాట్లాడి మూడు రోజులు అయ్యింది తెలుసా? అంటే దెబ్బై రెండు గంటలు... నాతో మాట్లాడకుండా ఎప్పుడైనా వున్నావా? అప్పట్లో నన్ను చూడకుండా గంటైనా గడపలేనివాడివి... ఇపుడు నన్ను చూడకుండా రోజులెలా గడుపుతున్నావ్! ఇప్పుడా ప్రేమంతా ఏమైపోయింది?

కానీ... నీకు సమయం వుండదు. నీ వ్యక్తిగత

# ఇంద్రధనుస్సు పల్లకిలా వంగి నన్ను నీ దగ్గరకు తీసుకెళ్ళదేం?



కార్యక్రమాలు ఆఫీసు, బాధ్యతలు.ఇక నీకు నన్ను పట్టించుకునే సమయం వుండదు. అయినా అడగకుండా వుండలేకపోతున్నాను! కనీసం రోజుకో అరగంటైనా నాతో గడపలేవా? నీవెంత బిజీగా వున్నా ఓ క్షణమైనా నేను గుర్తుకురాలేదా?

ప్రేమ అశాశ్వతం... అజరామరం అంటారే ... నీ హృదయంలో నా మీద ప్రేమ ఎందుకింత తొందరగా ఘనీభవించింది. ఆనందానికి నేనంటే మొహం మొత్తిందా? లేక నిర్లిప్తతకి నేనంటే ప్రేమ పుట్టుకొచ్చిందా?

ఎంత మధురంగా వుండేవి నీతో గడిపిన క్షణాలు... నిర్మలత్వాన్ని ఆపాదించుకొని తియ్యని రాగాలు పలికే నీ కళ్ళలో ప్రపంచంలోని ఆనందమంతా కనిపించేది నాకు... అపుడు ఈ ప్రపంచాన్ని చూస్తే నాకు జాలి కలిగేది! ఈ ప్రపంచమంతా బాధామయంలో వుందని నేనొక్కదాన్నే ఆనందంగా వున్నాననే గర్వం కూడా కలిగేది... ఇప్పుడా ఆనందం నన్నొంటరి దాన్ని చేసి నిర్దాక్షిణ్యంగా ఎందుకు వెళ్ళిపోయింది.

నీ గురించి అతిగా ఆలోచించి నేను పిచ్చిదాన్నైపోతున్నా... విరహం! అది నన్ను నిలువునా దహించి వేస్తుంది. చల్లని వాతావరణం బయట జోరుగా కురుస్తున్న వర్షం నా విరహాన్ని ఏ మాత్రం చల్లార్చలేకపోతున్నాయి. బాల్కనీలో కూర్చొని ఈ ఉత్తరం వ్రాస్తున్నా.. ఓ వర్షం ముక్క టప్ మని నా నెత్తిమీద పడి క్రిందకు జారుతుంటే ఒక్కసారిగా హృదయం జల్లుమంది. క్షణం తరువాత నిలువెల్ల వణుకు. విద్యుత్ ప్రకంపనాలు. గగుర్పాటు పొందిన శరీరంలో అకస్మాత్తుగా నీ జ్ఞాపకం. హిమాలయాల్లోకి వేగంగా ప్రాకే అలక్‌నందకు గమ్యమెక్కడ? అలాగే నా ఆలోచనలకు అంతమెక్కడ?

ఓ ప్రేమా? ఎందుకే నీలో ఇంత విషాదం! వస్తూనే వెళ్ళిపోతావన్న విషాదం. వెళ్ళిపోతూ వెళ్ళిపోతున్నావన్న విషాదం. నీకు హృదయం వుంటే తెలిసేది నేనెంతగా బాధపడుతున్నానో అని అడగాలనిపిస్తుంది. ఇలా నీ జ్ఞాపకాలతో ఘనీభవించిన నా హృదయం కరిగేమార్గమేలేదా?

అనుక్షణం నాకు నీ అనుభూతులే గుర్తొస్తున్నాయి ప్రియతమ్! ఏ సాగర కెరటమో ఉప్పెనలా వచ్చి నన్ను నీలో కలుపుకోదేం? ఏ ఇంద్రధనుస్సు పల్లకిలా వంగి నన్ను నీ దగ్గరికి తీసుకవెళ్ళదేం? ఏ శీతల గీతికా పవనమో నన్ను నీ అంతర్ముఖంలో ఐక్యం చేసుకోదేం?

గుర్తుందా ప్రియతమ్! నేను మొదటిసారి ఐ లవ్ యూ అన్నపుడు నీ మొహం ఎలా వికసించిందో. నీహారికా తెరల్లో నీలి మబ్బు మెల్లిగా విచ్చుకున్నట్లు... మంచుతో తడిసిన ముద్దమందారం ముగ్ధత్వంతో కొద్ది కొద్దిగా విచ్చుకున్నట్లు... సాగర కెరటాలు మెల్లి మెల్లిగా సముద్రుడిలో ఇమిడినట్లు... ఉషోదయపు కిరణాల వేడికి గులాబి మొగ్గ

# నా సిరల్లో, ధమనుల్లో రక్తం బదులు ప్రేమరసమే ప్రవహిస్తోంది!

విప్పుతుంటే దానిపై నున్న మంచుబిందువులు అలవోకగా రాలినట్లు నీ పెదాలు విప్పుకున్నాయి. ఇలా నీ అనుభూతులను నా హృదయమనే కాన్వాస్‌పై కళ్ళనే బ్రష్‌ను ఉపయోగించి ప్రేమ అనే రంగులతో ఎంతో అద్భుతంగా చిత్రించుకొని అతి పదిలంగా దాచుకున్నాను.

అయినా అప్పుడప్పుడు నా ప్రమేయం లేకుండా బయటికొస్తూనే వున్నాయి. ఇక నా వల్ల కాదు ప్రియతమ్‌! నేను భరించలేను. అక్కడ కూడా నీ ప్రేమరసమే ప్రవహిస్తుంది. 'ఐ లవ్ యూ' అని నాలోని అణువణువు నీ నామస్మరణే చేస్తుంది.

మన మధ్య ఇంతలోతైన అగాధం ఏర్పడటానికి కారణమేమిటి? అసలు తప్పెవరిది? నీదా? నాదా? ఇద్దరిదా? ఏమో మరి! ఆ భగవంతుడికే తెలియాలి!

మొదట్లో కొత్తదనమో... బిడియమో మరి నీకు నచ్చినట్లు నేనుండలేదు. ముద్దుపెట్టుకుంటే మెడమట్టూ చేతులు వేయాలని రెండు నెలల వరకూ తెలుసుకోలేకపోయాను. నిన్ను సంతోషపెట్టలేకపోయాను. నీతో ఆ ఆవేశమంతా ఏమైపోయింది! చెప్పాలంటే సిగ్గేస్తోంది. కానీ నీవు అపుడు ఎలా వుండేవాడివో నాకిపుడు అలాగే వుండాలనిపిస్తోంది. నీకు నచ్చినట్లు నేను మారేసరికి నీవు నాకు అందకుండా పోయావ్.

ఎలా ప్రియతమ్‌! మళ్ళీ మన మనసులు కలిసే మార్గమే లేదా?

నాకింకేం అక్కరలేదు. ఈ జీవితానికి నీ చూపు కాస్త కరుణ. ప్రేమా! ఆప్యాయత తప్ప!

ప్రియతమ్‌! ప్లీజ్! ఒక్కసారి ఇటు చూడు! నీకై నిరీక్షణతో విరసించిన నా నయనాలలో విషాదం పౌర్ణమినాటి చంద్రునిలో మచ్చవలె వుంది. అందమైన చందమామకు అది దిష్టిచుక్క అట! మరినాకో! నీ విరహానికి సంకేతము? నీ ఆగమనానికి ముందు వికసించే పద్మమా?

నా హృదయాంతరాళలలో రేగుతున్న సంఘర్షణ నన్ను ఏ పని చెయ్యనీయటంలేదు ప్రియతమ్‌! నీకై నిరీక్షించేలలసిసొలసిన నా హృదయం బేలగా మారిన నా కళ్ళు కొన వూపిరిలో నేను నిస్సహాయంగా వున్నా అయినా నాలోని ప్రతి రక్తపుబొట్టు నీ ప్రేమకే తపిస్తుందని ఈ ఉత్తరం వ్రాస్తున్నా. ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకుంటావనుకుంటున్నాను.

బాధతో నిండిన హృదయం ప్రక్షాళనమవ్వడానికి భగవంతుడు కన్నీళ్ళను ఇచ్చాడట! నా కన్నీళ్ళకి భాష వచ్చుంటే తెలిసేది ఇక్కడ నేనెంతగా ఫీలవుతున్నానో! ఆవేదన నిండిన హృదయం ఆర్తితో ఆక్రోశిస్తుంది ప్రియతమ్‌! ఇప్పటికైనా నీవు నన్ను అర్థం చేసుకుంటే ఇంతకన్నా నా జీవితానికి ఇంకేం కావాలి!

సదా నీ జ్ఞాపకాలలో పరిష్వంగమవుతూ నీ ప్రేమకై ఎదురుచూసే

నీ సింధూజ

"ఎవరురా ఈ సింధూజ" అని అడిగాడు శ్రీరామ్ ఎగ్జయింటింగ్‌గా

"ఏమో తెలియదు" చెప్పాడు వైభవ్ ముభావంగా.

"అసలు ఈ కాగితం నీ దగ్గరికి ఎలా వచ్చింది" అన్నాడు శ్రీరామ్ అర్థం కానట్లు.

"కాఫీలో చక్కెర తక్కువయిందని నా మొహాన కప్పువిసిరికొట్టింది నా భార్య" అన్నాడు వైభవ్ బాధగా.

"అది మీ ఇంట్లో మామూలేగా" అన్నాడు శ్రీరామ్ పట్టించుకోనట్లు.

"అవుననుకో! కానీ... అపుడు తుడుచుకుందామని ప్రక్కన కబోర్ట్‌లోని పేపర్ తీసాను. అదే ఇది! మనకెలాగు ఇంత మంచి భార్యలు దొరకలేదు. కనీసం చదువుకోడానికైనా బాగుందని దాచిపెట్టాను" అన్నాడు వైభవ్.

"ఆ! ఎవరో పిచ్చిది! ఈ కాలంలో ఇంకా ఇలాంటి భార్యలున్నారా? ఇంత భావుకత్వంలో బ్రతికేవాళ్ళు" అన్నాడు శ్రీరామ్ భావుకత్వం అనే మాటను ఒత్తిపలుకుతూ.

"ఏమో మరి! నేవస్తా" అన్నాడు వైభవ్ దిగులుగా.

"సరే" అంటూ స్కూటర్ కిక్ కొట్టి హెల్మెట్ మొహానికి తగిలించుకున్నాడు శ్రీరామ్. తన మొహంలోని భావాలను స్నేహితుడు ఎక్కడ గుర్తుపడుతాడోనని...

అయినా ఇద్దరిలో రేగుతున్న విషాదానికి కారణం నేను చెప్పనవసరం లేదనుకుంటా!

అందని ద్రాక్షపండ్లను చూసి పుల్లగానే వుంటాయనుకుంటారు కొందరు.



## బాబోయ్! భయమేస్తుంది?

కృష్ణ కథానాయకుడుగా మహిళా దర్శకురాలు విజయనిర్మల అక్టోబర్‌లో ఆరంభించనున్న భారీ చిత్రానికి ఓ నవల హక్కుల్ని కొనడం జరిగింది. ఈ విషయమై ఏ నవల కొన్నారో చెప్పమని అడిగితే- 'బాబోయ్!' ఆ నవల పేరు మాత్రం చెప్పను. అట్లా చెబితే మేము షూటింగ్ ప్రారంభించే నాటికే ఆ నవలలోని సన్నివేశాల్ని కాపీ కొట్టి ప్రేక్షకులకు చూపించేస్తారు' అని విజయనిర్మల చెప్పారు.

- మానేపల్లి సంపత్‌బాలకృష్ణ.